క్లుప్తంగా

ఘనంగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం



ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలోని పడాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వాహకుడు మాద్రాజు వెంకన్న ఆధ్వర్యంలో ఆదివారం కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో నవగ్రహాలు, నాగమయ్య పడిగె, శివలింగాలను దాతల సహకారంతో ప్రతిష్ఠించారు. తొలుత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని పూజారుల వేదమంత్రోచ్చరణల నడుమ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని స్వప్న శ్రీనివాస్‌గౌడ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం చేశారు. ఆలయం వద్ద జాతర నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఎస్సీ వర్గీకరణ ఉద్యమాలకు మద్దతు



వర్ధన్నపేట : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ తలపెట్టిన ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమాలకు ప్రజా సంఘాల నాయకులు జన్ను రాములు, డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి, అంజయ్య, ఈరెల్లి శ్రీనివాస్ మద్దతు ప్రకటించారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంద కృష్ణ సుమారు 30 ఏళ్లుగా పోరాటాలు కొనసాగిస్తారని చెప్పారు. ఈనెల 7న తలపెట్టిన లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. తుమ్మల కుమారస్వామి మాట్లాడుతూ మంద కృష్ణ పోరాటాల ఫలితంగానే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీ అమలుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు తుమ్మల కుమార్, కంజర్ల సందీప్, సమ్మయ్య పాల్గొన్నారు.

పరామర్శ



చెన్నారావుపేట : మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన నాంపెల్లి కృష్ణవేణి, చెన్నారావుపేటకు చెందిన గట్ల నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. తొలుత ఆయన మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు బాల్నె వెంకన్న, అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, నాయకులు జున్నూతుల మహేందర్‌రెడ్డి, అమ్మ రాజేశ్, కందకట్ల సాంబయ్య, రఫీ, గట్ల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాగంపేటలో..

ఖానాపురం : మండలంలోని రాగంపేటకు చెందిన కృష్ణ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలగందుల రాజు ఆధ్వర్యంలో పరామర్శించారు. తొలుత కృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యంతోపాటు రూ.5 వేల నగదు సాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేశ్, మాజీ ఉపసర్పంచ్ మీసం రవీందర్, నాయకులు రాంబాబు, జానయ్య, దేవేందర్, ప్రసాద్, రవి, సంపత్, ఎల్లాచారి, తదితరులు పాల్గొన్నారు.

గోపనపల్లి...

వర్ధన్నపేట : మండలంలోని గోపనపెల్లిలో జన్ను దూడయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేశ్ పరామర్శించారు. తొలుత దూడయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వివేకానంద, భాస్కర్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత

ఖిలా వరంగల్ : వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పిపోయిన మూడేళ్ల బాలుడిని స్థానికులు పోలీసులకు అప్పగించగా పోలీసులు అతడి తల్లికి సురక్షితంగా అప్పగించారు. వివరాలిలా.. బాలుడు తప్పిపోయి ఏడుస్తుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో పోలీసులు రాత్రి 9.30 గంటలకు బాలుడి తల్లిదండ్రులు ముత్యాల యాకయ్య, శ్రావణి ఉన్నట్లు గుర్తించి కానిస్టేబుల్ కుతుబ్ అప్పగించారు. పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరిన తల్లి శ్రావణికి బాబు కనిపించకపోవడంతో ఆమె ఆందోళనకు గురైంది. రోడ్డుపై వెతుకుతున్న క్రమంలో పోలీసులకు బాలుడి తల్లి శ్రావణ తారసపడగా అప్పగించారు.

విలీన ప్రక్రియలో అయోమయం

- సాంకేతిక సమస్యలతో అడ్డంకులు
- వేర్వేరుగా రెండు శాఖల ఉత్తర్వులు



నర్సంపేటలోని మున్సిపల్ కార్యాలయ భవనం

నర్సంపేట : విలీన గ్రామాల విషయంలో సాంకేతిక సమస్యలు నెలకొని గందరగోళానికి దారి తీస్తోంది. ఎలక్షన్ కమిషన్ ఒకలా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం మరోలా విలీన గ్రామాల జాబితా విడుదల చేయడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. మున్సిపాలిటీలో ఇప్పటికే 24 వార్డులున్నాయి. ఆ సంఖ్యను 30కి చేర్చేలా చర్యలు చేపడుతున్నారు. కాగా పలు నిబంధనలు, సాంకేతిక సమస్యలతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

వేర్వేరుగా ఉత్తర్వులు

నర్సంపేట మున్సిపాలిటీ అభివృద్ధి, విస్తరణ కోసం చేపట్టిన గ్రామాల విలీన ప్రక్రియ కొలిక్కి రావడం లేదు. మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు 8 గ్రామాలను విలీనం చేస్తామని ఉత్తర్వులు జారీ చేయగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ మాత్రం 6 గ్రామాలనే కలపాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉద్యోగులు అయోమయానికి గురవుతున్నారు.

రాజుపేటపై ఆగ్రహం

పట్టణ సమీపంలోని రాజుపేట ఏజెన్సీ పరిధిలోకి వస్తుందన్నది జగమెరిగిన సత్యం. పీసీ చట్టం ప్రకారం ఆ గ్రామాన్ని మున్సిపాలిటీలో అవకాశం లేదు. 1/70 చట్టం ప్రకారం మున్సిపాలిటీలో కలపొద్దని స్థానిక ప్రజలు రాష్ట్రస్థాయిలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ క్రమంలో రాజుపేటను మున్సిపాలిటీలో కలిపే అవకాశం లేదు. ఆదివాసీ చట్టాలను ఉల్లంఘించొద్దని, ఒకవేళ నర్సంపేటలో కలిపితే ఆందోళనలు తప్పవని ఆయా సంఘాల నాయకులు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో మున్సిపాలిటీలో కలిసే విలీన గ్రామాల జాబితాపై సందిగ్ధత నెలకొంది.

ముగ్దుంపురంపై...

రాములునాయక్‌తండా, మహేశ్వరం, రాజపల్లె, ముగ్దుంపురం, మాధన్నపేట, ముత్తోజిపేట, నాగుర్లపల్లి, పర్శనాయక్‌తండాలను విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా పాతముగ్దుంపురం నుంచి ముగ్దుంపురం ఏర్పడగా సాంకేతిక సమస్యతో మున్సిపాలిటీలో కలవడానికి వీలు కావడం లేదు. దీంతో అధికారులు, రాజకీయ నాయకుల్లో గందరగోళం నెలకొంది. సమస్యను పరిష్కరించి అనువైన గ్రామాలను కలిపితేనే మున్సిపాలిటీ అభివృద్ధిలో మనుగడ సాధిస్తుందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కుమార్

రాయపర్తి : మండలంలోని మైలారంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించే లక్ష్యంతో ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆసక్తి కలిగిన జట్లు పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ చాటిన జట్లకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల రంగారెడ్డి, లేతాకుల మధూకర్‌రెడ్డి, ఉప్పుగల్ల శ్రీనివాస్, పరుపాటి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెం హైస్కూల్‌లో 2004-05 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. నాటి ఉపాధ్యాయులు రామారావు, రాజిరెడ్డి, సదయ్య, గిరిధరాచార్యులును ఘనంగా సన్మానించారు. వరంగల్, హైదరాబాద్, బెంగుళూర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన 50 మంది ఒకే వేదికపై కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఒకరికొకరు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజినీదేవి వేడుకను ప్రారంభించి మాట్లాడారు. పూర్వవిద్యార్థులను అభినందించారు. తొలుత చిన్ననాడు విద్యాబుద్ధులు నేర్పి ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయురాలు రమాదేవి ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కాగితపు పూర్ణచంద్రచారి, కూస రాజు, సాయిరాజు, రాజు, సునీత, సమత, మేనక, అనూశ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పునరుద్ధరణ పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నర్సంపేట : పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పునరుద్ధరణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ఆవరణలో కూర్మ యంత్ర శంకు పూజలు, జపాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అర్చకులు కృష్ణమాచార్యులు, వెంకటాచార్యులు, మాధవాచార్యులు, రామానుజాచార్యులు, ఆదిత్యాచార్యులు, శేషాచార్యులు, వెంకటనర్సింహాచార్యులు, శ్రీకర్, రంగనాథస్వామి పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈనెల 7న ఉదయం 11.26 నిమిషాలకు ముగ్గు పోసే పనితోపాటు కూర్మ యంత్ర, శంకు ప్రతిష్ఠలకు ప్రధాన అర్చకులు వెంకటాచార్యులు ముహూర్తం నిర్ణయించారు. భక్తులు వాస్తు పూజలో పాల్గొని నవధాన్యాలు, ముత్యం, పగడం, బంగారం వంటివి సమర్పించి ఆధ్యాత్మిక భజన, పారాయణాలు చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్ర జగన్ మోహన్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు దుబ్బ రమేశ్, కార్యదర్శి వేమిశెట్టి శ్రీనివాస్, సభ్యులు చింతల నిరంజన్, రామగోని సుధాకర్, వీరమనేని వెంకటేశ్వరరావు, పట్టణ ప్రముఖులు పెండెం రామానంద్, మెరుగు లక్ష్మణ్, బాబు, పాలాయి రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు

పర్వతగిరి : విలేకరులమంటూ డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్న మండల కేంద్రానికి చెందిన దొడ్డ శ్రీనివాస్, చింతనెక్కొండకు చెందిన బోనాల సాంబయ్యపై మండల కేంద్రానికి చెందిన దుంపల వేణు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తను పౌల్ట్రీయిస్ నడుపుతూ ఉపాధి పొందుతుండగా డబ్బులు ఇవ్వాలని శ్రీనివాస్, సాంబయ్య వేధిస్తున్నట్టు వేణు తెలిపాడు. ఇప్పటి వరకు కొన్ని డబ్బులు ముట్టజెప్పానని, అయినా ఇబ్బంది పెట్టడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. డబ్బులు ఇవ్వకపోతే పేపర్‌లో వార్తలు రాస్తామని బెదిరించినట్లు చెప్పాడు. ఈ విషయమై ఎస్సై బోగం ప్రవీణ్‌ను వివరణ కోరగా ఇద్దరు విలేకరులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వేణు చేసిన ఫిర్యాదుపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

కంచె వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని..

సంగెం : రైతులు వ్యవసాయ బావులకు వెళ్లే దారిలో అడ్డుగా కంచె వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని లోహితకు చెందిన కోల రాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై నరేశ్ వివరాలు వెల్లడించారు. లోహితకు చెందిన చెరుకు రాజు ఏడేళ్ల క్రితం దారికి కంచె వేస్తే ఆ దారి మీదుగా వ్యవసాయ పొలాలకు వెళ్లే సుమారు 40 రైతులు అధికారులకు విన్నవించడంతో తీసేశాడని తెలిపారు. మళ్లీ శనివారం కంచె వేయడంతో విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశాడని చెప్పారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

నల్లబెల్లి : ప్రజాపాలనలో భాగంగా మండలంలోని రాంతీర్థం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేరుగు శ్రీను మాట్లాడారు. 33 మందికి ఇందిరమ్మ ఇండ్లు, 71 మందికి రేషన్‌కార్డులు, 20 మందికి ఆత్మీయ భరోసా పథకం అందించేందుకు అధికారులు అర్హులను ఎంపిక చేసినట్టు తెలిపారు. గ్రామంలో మరో సుమారు 10 మంది అర్హులకు పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు చిర్ర నరేశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తాహెరా, మండ కల్పన, బుద్ధి సంపత్, పాదిల శోభన్, నాయకులు పాదిల అశోక్, మేరుగు చందర్, మండ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్ ఖన్నా



క్రీడాదుస్తులు, క్రికెట్ కిట్ అందజేస్తున్న రాజేశ్

వర్ధన్నపేట : క్రీడలతో శారీరక, వికాసం కలుగుతాయని స్థానిక పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేశ్ ఖన్నా తెలిపారు. మండలంలోని కొత్తపల్లిలో యువతకు ఆదివారం ఆయన క్రీడాదుస్తులు, క్రికెట్ కిట్ అందజేసి మాట్లాడారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని సాధన చేయాలన్నారు. తద్వారా క్రీడల్లో రాణించి మండల, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి గ్రామ కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తామని చెప్పారు. క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని, స్నేహ సంబంధాలు మెరుగవుతాయని తెలిపారు. యువత క్రీడల్లో రాణిస్తే మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. క్రీడాసామగ్రిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడల్లో రాణించే వారికి సహాయ, సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

కేంద్ర బడ్జెట్‌తో సామాన్యులకు నిరాశే

- ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకుడు రాజమౌళి

నర్సంపేట రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో సామాన్యులకు నిరాశే మిగిలిందని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు కొత్తకొండ రాజమౌళి అన్నారు. నర్సంపేట మండలంలోని మాదన్నపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అనుకూల రాష్ట్రాలకు వేలాది కోట్లాది రూపాయలు కేటాయించి, తెలంగాణకు మొండిచేయి చూపించారని తెలిపారు. ఉద్యోగాల కల్పన ప్రస్తావనే లేకుండాపోయిందని చెప్పారు. వ్యవసాయ రంగంపై గతంలో ఉన్న ఎరువుల సబ్సిడీ తగ్గించారని వివరించారు. కేంద్రానికి రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో రూ.26 వేల కోట్లు సమకూరుతున్నా తెలంగాణ పట్ల వివక్ష చూపడం సరికాదన్నారు. నిధులు రాబట్టడంతో ఎంపీలు విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్నె సాంబయ్య, పార్టీ గ్రామ కమిటీ కార్యదర్శి అనుమాల రమేశ్, నాయకులు గుర్రం రవి, ఆకుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి కిరణ్‌కుమార్ అన్నారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ ప్రస్తావన రాకపోవడం అన్యాయమన్నారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలు ఉండి సాధించిందేమీ లేదని అసహనం వ్యక్తం చేశారు. నిధులు సాధించడంలో బీజేపీ రాష్ట్ర కమిటీ విఫలమైందని విమర్శించారు.

కార్మికులకు మొండిచేయి.. కార్పొరేట్ శక్తులకు అనుకూలం

నర్సంపేట/వర్ధన్నపేట : కేంద్ర బడ్జెట్ కార్మిక వర్గానికి మొండిచేయి చూపిందని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్‌పీఐ) రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్ విమర్శించారు. వారు మీడియాతో వేర్వేరుగా మాట్లాడారు. దేశంలోని అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావడానికి అనేక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాల్సిన తరుణంలో బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడాన్ని యువరాజు ఖండించారు. అంబానీ, అదానీ లాంటి సంపన్నులకు లబ్ధి చేకూర్చేలా తయారు చేసిన బడ్జెట్‌ను ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చదివినట్టు ఉందని వల్లందాసు కుమార్ అభివర్ణించారు.

చెరువు నిండా నీరు.. అయినా రైతులకు కన్నీరు

- కాల్వల్లో జమ్ము, గుర్రపు డెక్క, తూటు తీగ
- తూము శిథిలం.. తాళ్లతో కట్టిన వైనం
- చివరి ఆయకట్టుకు నీరందని దైన్యం



రాడ్ విరగడంతో తాళ్లతో కట్టిన తూము



గుర్రపు డెక్కను తొలగిస్తున్న రైతులు

సంగెం : అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోటిలో శని అన్న చందంగా తయారైంది రైతుల పరిస్థితి. చెరువు నిండా నీరున్నా పంటలకు నీరు అందని దుస్థితి నెలకొంది. అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యం అన్నదాత కన్నీటికి కారణమవుతోంది. గోడు పట్టించుకునే నాథుడే లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని ఎల్గూర్‌రంగంపేట చెరువు నిండా నీరుంది. ఈ నీరు చెరువు కింద మొత్తం విస్తీర్ణంలో యాసంగి వరి పంటకు సరిపడడంతోపాటుగా ఖరీఫ్‌కు సరిపోతుంది. దీనికితోడు ఎస్సారెస్పీ కెనాల్ నుంచి చెరువులోకి నీరు వచ్చి చేరుతోంది. చెరువు కింద అధికారికంగా 760, అనధికారికంగా సుమారు మరో వెయ్యి ఎకరాలకుపైగా సాగవుతోంది. చెరువుకు బుర్రతూము, నక్క తూము, మిట్ట తూము, జాలు తూములున్నాయి. వీటిలో జాలు తూము షట్టర్ గతంలో శిథిలమైపోయింది. ఎక్కువ నీరు బయటకు వెళ్తుండడంతో తాత్కాలికంగా నీరు బయటకు పోకుండా ఏర్పాట్లు చేశారు. వానాకాలంలో వర్షాలకే పంటలు పండిన విషయం తెలిసిందే. జాలు తూము సుమారు 7 కిలోమీటర్ల దూరం వరకు విస్తరించి అధికారికంగా 375 ఎకరాలు, అనధికారికంగా మరో 300 ఎకరాలు సాగవుతోంది. మిట్ట తూము కింద సుమారు 150 ఎకరాల్లో వరి సాగవుతోంది. దీని షట్టర్ శిథిలమై విరిగి పడి జామ్ కావడంతో తూము నుంచి నీరు తక్కువగా వస్తోంది. షట్టర్ రాడ్ విరిగిపడడంతో తాళ్ల సాయంతో కట్టి ఉంచారు.

కాల్వల్లో జమ్ము, గుర్రపు డెక్క.....

చెరువు పంట కాల్వల్లో జమ్ము, గుర్రపు డెక్క, తూటు తీగ అల్లుకుపోయి ఆయకట్టు చివరి పంటలకు నీరు అందని దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితిలో వరి నారు ముదిరిపోతుండడంతో నాటు వేసుకునేందుకు రైతులే కాల్వల్లోకి దిగి అల్లుకుపోయిన తీగను తొలగిస్తున్నారు. నీరందని పరిస్థితిలో ఇప్పటికీ నాటు వేయకుండా నీటి కోసం రాత్రింబవళ్లు కాపుకాయల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూము నుంచి తక్కువగా నీరు వస్తుండడంతో రైతుల నడుమ గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం, అధికారుల మీద ఆశ వదులుకుని కొందరు రైతులు తామే కొంత మేరకు గుర్రపు డెక్క తొలగిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడి తూము షట్టర్‌కు మరమ్మతు చేయించడంతోపాటు కాల్వల్లోని జమ్ము, గుర్రపు డెక్కను తొలగించి చివరి ఆయకట్టుకు సైతం నీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

నీరందించి ఆదుకోవాలి

చెరువు నిండా నీరు ఉన్నా కాల్వల్లో జమ్ము, గుర్రపు డెక్క, తూటు తీగ నిండడంతో నీరు అందని దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కాల్వలను శుభ్రం చేయించి నీరందించి రైతులను ఆదుకోవాలి.

\- బోనాల లింగమూర్తి, రైతు

సమస్యను పరిష్కరిస్తాం

ఎల్గూర్ రంగంపేట చెరువు నిండా నీరుంది. మిట్టతూము షట్టర్ పాడైపోగా మరమ్మతు చేయించే పరిస్థితి లేదు. నీరు అయిపోయాక మరమ్మతు చేయిస్తాం. కాల్వల్లో జమ్ము తొలగించి నీరందేలా ఏర్పాట్లు చేసి సమస్య పరిష్కరిస్తాం.

\- హామీద్, ఐబీ ఏఈ

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం



బోనాలతో వస్తున్న మహిళలు

ఖిలా వరంగల్ : వరంగల్ 42వ డివిజన్ రంగశాయిపేటలో నెహ్రూ విగ్రహం జంక్షన్ సీతారాముల దేవస్థానం వద్ద లక్ష్మి, భూలక్ష్మి బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ కన్వీనర్లు కొల్లూరు యోగానంద్, గుండు పూర్ణచందర్ ఆధ్వర్యంలో వేద పండితుడు భాస్కర్‌చారి బృందం నేతృత్వంలో బొడ్రాయికి పూజలు చేశారు. పలుకాలనీల మహిళలు బోనంతో తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం దూపకుంట గ్రామానికి చెందిన బైండ్ల కులస్తులు బొడ్రాయి ఎదుట బలిధారణ కోసం పట్నం వేసి పూజలు చేశారు. గౌడ కులస్తులు హాజరై ఉత్సవ కమిటీ సభ్యులకు కల్లు ఘట్టం అందజేశారు.

'అన్ని రంగాల్లో అన్యాయం'

ఖిలా వరంగల్ : వరంగల్ శంభునిపేటలో వరంగల్ బీసీ యునైటెడ్ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో బీసీ టీచర్స్ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ ఇంటలెక్చువల్స్ ప్రతినిధి డాక్టర్ ఆవ్వారు వేణుకుమార్ హాజరై మాట్లాడారు. బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వరంగల్ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.వీరస్వామి మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ టీచర్లు తమ ఓటు శక్తిని చాటుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు కలిసి సమాజ ఐక్యతపై చైతన్యవంతం చేయాలని అభిప్రాయపడ్డారు. అంతకుముందు బీసీ టీచర్స్ ఫోరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కోఆర్డినేటర్లు మండల పరశురాములు, ధర్మపురి రాజగోవిందు, బీసీ నేతలు తుమ్మ తిరుపతి, చిగిరి కుమారస్వామి, కృష్ణ, అంకం సతీష్, రమేష్‌బాబు, ఆరెల్లి శ్రీనివాస్, సురేష్, రమేష్, భాస్కర్, జ్ఞానేశ్వర్, నరసింహాచారి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో దరఖాస్తు గడువు పొడిగింపు

పర్వతగిరి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 6 వరకు గడువు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ (డీసీఓ) అపర్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4, 5, 6, 7, 8వ తరగతులు చదువుతున్న పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆంగ్ల మాధ్యమ విద్యతోపాటు పుస్తకాలు, పౌష్టికాహారం ఉచితంగా లభిస్తాయని పేర్కొన్నారు. క్రీడల్లో సైతం విద్యార్థులను ప్రోత్సహిస్తూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న క్రమంలో విద్యార్థులను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చేర్పించాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా బోరిగం నాగరాజు

ఖిలా వరంగల్ : బీజేపీ కరీమాబాద్ మండల అధ్యక్షుడిగా బోరిగం నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు నాగరాజుకు ఆ పార్టీ ఎన్నికల అధికారి ఎడల లక్ష్మీనారాయణ ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు విలేకరులతో మాట్లాడారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా..

ఆత్మకూరు : రెడ్డి సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన వంగాల భగవాన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో భగవాన్‌రెడ్డి 79 ఓట్ల మెజార్టీతో గెలిపొందారు. ఈ సందర్భంగా భగవాన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రెడ్డి కులస్తుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఆయనను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.